

సోమదేవ భూపాలుడు శత్రు జన భయంకరుడు. పరాక్రమవంతుడు. ప్రజలను కన్న బిడ్డల్లా చూసుకుని వారి యోగ క్షేమములను ఎప్పటి కప్పుడు తెలుసుకుని పరిపాలన సాగిస్తున్న రాజు. అతనంటే ప్రజలకు వల్లమాలిన అభిమానం. కందారమనే పట్టణాన్ని రాజధాని చేసుకుని పరిపాలిస్తున్నాడు. ఇంతేకాదు. మంత్రకూటము, భద్రాచలము మొదలైన ప్రదేశములలో ఆవుల మందలను చేర్చి వాటి పోషకత్వమునకై అధికారులను నియమించి విశేష భక్తి శ్రద్ధలతో వాటిని పోషిస్తున్నాడు.

ఒక దేశపు రాజు బలవంతుడై, జన రంజకంగా పరిపాలన సాగిస్తూ, అయిశ్వర్యములలో తులతూగడం పొరుగు రాజులు సహించరు. ఎప్పటికైనా ఆ రాజు వల్ల కాని, అతని సంపద వల్ల కాని, లేదా తమ ప్రజల వల్ల కాని తమ అధికారానికి భంగం కలుగుతుందేమోనని వారు భయపడతారు. పొరుగు రాజు బలవంతు డవడం ఇష్టపడరు.

సరిగ్గా ఇలాంటి ఆలోచనే చేశాడు పొరుగు దేశానికి ఏలిక అయిన కటకపురాధీశ్వరుడు బల్లహుడు. సోమదేవుడు ఎంత బలవంతుడో ఎప్పటి కప్పుడు చారుల ద్వారా తెలుసుకుంటున్నాడు. ఆందోళన పడ్డాడు. ఆలోచన చేశాడు. మంత్రి దండ నాయకులతో మంతనాలు జరిపాడు.

సోమదేవరాజు అయిశ్వర్యం అతన్ని మరీ కలవర పెడుతూంది.

ఒక రోజున పెద్ద సైన్యంతో దండయాత్ర ప్రారంభించాడు. ముందుగా గోదావరీ తీరప్రాంతంలో ఉన్న సోమదేవుని పశుగణాలకి దగ్గరగా విడిది చేసి, గోపాలురను అదిలించి, బెదిరించి గోవులను తోలుకుని పోవడం ప్రారంభించాడు. గోవులను సంరక్షించడానికి సోమదేవుడు నియమించిన వీర భటులకు, బల్లహుని సైన్యానికి ఘోర యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో వీరభటులు చాలామంది చని పోయారు. చావగా మిగిలిన వారు కందారమునకు పరుగెత్తి కెళ్ళి "ఓ రాజా! కటకపురాధీశ్వరుడయిన బల్లహుని సైన్యములు మాపై దండయాత్ర జరిపి అనేకమందిని జంపి, గోవులను తోలుకుని పోవుచున్నవి. రక్షింపుము" అని వేడుకున్నారు.

సోమదేవుడు బల్లహుని దుర్నిర్ణయానికి కోపోద్రిక్తుడయ్యాడు. వెంటనే యుద్ధానికి సన్నద్ధుడై సైన్యంతో బల్లహుని సైన్యంపై విరుచుకు పడ్డాడు. ఆరు నెలలు యుద్ధం జరిగింది. అందులో ఒకప్పుడు సోమదేవుడు మరొకప్పుడు బల్లహుడు

# పరీక్ష

— వీరభద్రరావ్ పమ్మి

విజయం సాధిస్తున్నారు. కొన్నాళ్ళ తరవాత సోమదేవుడు యుద్ధము మాని కందారమునకుతిరిగి వెళ్ళి, రాజధాని వదిలి బయటికి రాకుండా ఉండిపోయాడు.

బల్లహుడు పరాక్రమవంతుడు కావడం, తనకు పురుష సంతానం లేకపోవడం సోమదేవుణ్ని కలవర పెట్టాయి. అమాత్యుణ్ని, పురోహితులను పిలిపించి తన దుఃఖానికి కారణం తెలియజేశాడు. పురోహితులు ఎంతో ఆలోచించి పుత్రకామేష్టి చెయ్యమని సలహా ఇచ్చారు. సోమదేవరాజు తన భార్య అయిన సిరియాలదేవి అనుమతితో యథావిధిగా పుత్రకామేష్టి యాగం చేశాడు.

కొంత కాలానికి సిరియాలదేవి కడుపు పండింది. శత్రు సంహారము, పుత్రోదయం కోరుతూ సోమదేవ రాజు పుత్రకామేష్టి చేశాడనివిన్న బల్లహుడు కుపితుడై రాణితో సహా సోమదేవరాజును పట్టుకోవాలన్న ఉద్దేశంతో అతనిపై యుద్ధం ప్రకటించి, ప్రస్థానభేరి మోగించి, గజ, ఘట, హయ పదాతి దళములతో బయలుదేరి కందార పట్టణాన్ని ముట్టడిచాడు.

మహా పరాక్రమవంతుడైన సోమదేవరాజు వెను దీయకుండా శత్రువుని ఎదుర్కొన్నాడు. అరవై రోజుల పాటు యుద్ధం జరిగింది. యుద్ధంలో సోమదేవరాజు మరణించాడు.

భర్త మరణవార్త విన్న సిరియాలదేవి శోక సంతప్త చిత్తయై తన దగ్గరున్న ధన కనక వస్తు వాహనా లన్నిటినీ దానం చేసేసి, శత్రువులు కోటను ముట్టడించక ముందే కోట విడిచి అనుమకొండకు పారిపోయింది. అక్కడ రాజ్యం చేస్తున్న ఎరుక మహారాజును శరణు కోరింది.

బల్లహుడు పరాక్రమవంతుడు. బలవంతుడు. సిరియాలదేవికి ఆశ్రయ మివ్వడమంటే బల్లహునితో విరోధము తెచ్చుకున్నట్లే. ఆ విషయం గ్రహించిన ఎరుక రాజు ఆమెకు శరణు ఇచ్చి రక్షించడం తన వల్ల కాదని, వెంటనే అనుమకొండ విడిచి వెళ్ళమని సిరియాలదేవికి చెప్పాడు.

సిరియాలదేవికి దుఃఖించడం మినహా ఏంచెయ్యాలో తోచలేదు. బల్లహుడు తనని పట్టుకోవడం, తనని వధించటం ఖాయమని ఆమెకు తెలుసు. ఆమె తన ప్రాణం కోసం ఆశించడంలేదు. కాని తన కడుపులో ఉన్న బిడ్డ. ఆ బిడ్డను రక్షించుకోవడం తన విధి అనుకుంది.

ఏం చెయ్యాలా అని ఆలోచించింది.

* * * *


అనుమకొండలో మాధవశర్మని ఎరగని వాళ్ళు లేరు. అతను సకల శాస్త్ర పండితుడు. షట్కర్మనిరతుడు. సద్బ్రాహ్మణుడు. దయాశీలుడు.

తన ఇంటి వాకిట్లో కూర్చుని తోటి పండితులతో శాస్త్ర చర్చ జరుపుతున్న మాధవశర్మ ఎవరో తెలియని స్త్రీ వచ్చి తన కాళ్ళమీద పడేసరికి ఆశ్చర్య చకితు డయ్యాడు. క్షణం పాటు నిర్ఘాంత పోయాడు.

"ఎవరమ్మా నువ్వు? ఏమిటి నీ కొచ్చిన ఆపద!" అన్నాడు.

"మీ శరణు కోరి వచ్చాను. ఆపదలో ఉన్నాను. నా ప్రాణం మీద తీపితో కాదు—నా గర్భంలో పెరుగుతున్న శిశువు మీద తీపితో." అందా స్త్రీ.

మాధవశర్మకి ఆశ్చర్యంగా ఉంది.




వచ్చిన స్త్రీ చూడడానికి పెద్ద కుటుంబీకు రాలుగా ఉంది. తనని శరణు వేడుతూంది. తనేం పరాక్రమవంతుడు కాదు. బలవంతుడు అంతకన్నా కాదు. ఏదో శాస్త్ర చర్చ చేసుకుని, ఉపన్యాసాలు ఇచ్చే బ్రాహ్మణుడు. అదేమాట ఆమెతో అన్నాడు. ఆమె తల ఎత్తి "శరణు ఇవ్వడానికి, ఒక మనిషిని రక్షించడానికి కావలిసింది బలపరాక్రమాలు కావు. సచ్ఛీలత, దయా దాక్షిణ్యాలు. అవి మీ దగ్గర పుష్కలంగా ఉన్నాయని విన్నాను. అందుకే మీ దగ్గరికి వచ్చాను. మీ పుత్రిక లాంటిదాన్ని. కష్టంలో ఉన్న ఆడదాన్ని. అందునా గర్భవతిని" అని జాలిగా చూసింది.

మాధవశర్మకి కడుపు తరుక్కుని పోయింది. మనసు విలవిల లాడింది.

"చూడమ్మా! నీకు శరణు ఇస్తున్నాను. నా ప్రాణం పోయినా సరే. నీకు ఏ ఆపద కలగకుండా రక్షిస్తాను. అసలున్నెవరవు? నీ కొచ్చిన ఆపదేమిటి? ఎవరి వల్ల? వివరంగా చెప్పు" అన్నాడు.

సిరియాలదేవి చెప్పడానికి సంశయిస్తూ చుట్టూ చూసింది. అది గ్రహించిన మాధవశర్మ వాకిలి తలుపు వేసి వచ్చి "వీళ్ళంతా నా మిత్రులు. సోదర పండితులు. నాకు ఎంతో అంతరంగికులు. నీకు శరణు ఇవ్వడంలో వీరి సలహా, సహాయంకూడా నేను తీసుకుంటాను. వీరి వద్ద మనం రహస్యంగా ఉండవలిసిందేమీ లేదు. నిస్సందేహంగా చెప్పు" అన్నాడు.

"నేను సోమదేవభూపాలుని అర్ధాంగిని. సిరియాల దేవిని."

ఈ మాటలు విన్న మాధవశర్మతో సహా పండితు లంతా ఆశ్చర్యయారు. ఒకరి ముఖా లొకరు చూసుకున్నారు. తమకు తెలియకుండానే అందరూ లేచి నిలబడ్డారు. మిగిలిన కథ ఆమె చెప్పకుండానే వాళ్ళకి తెలిసింది.

"ఓ సాధ్వీ! నీకు ఆవగింజంత భయం లేదు. సిద్ధేశ్వరుడు నిన్ను రక్షిస్తాడు. నువు నా గృహంలో నివసించుము" అని అభయ మిచ్చాడు.

ఆ సమయంలో మాధవశర్మ ఇంటిలో ఉన్న మిగతా పండితు లందరూ మాధవశర్మ నిర్ణయానికి సంతోషించారు. అంతేకాదు. ఈ విషయాన్ని గోప్యంగా ఉంచుతామని మాట ఇచ్చారు.

* * *

కందార పట్టణంలోని వీరులు. సైనికులు' సామంతులు బల్లహునితో పోరాడలేక, అతనికి ఎదురు నిలవలేక ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పట్నం వదిలి విదేశాలకు పారిపోయారు.

బల్లహుడు విజయ గర్వంతో దయా ధర్మ శూన్యుడై కోటలు తవ్వి, తలుపులు విరిచి, మేడలు కూల్చి, అంతఃపురం తవ్వించి సిరియాల దేవిని పట్టుకోడానికని ఇల్లిల్లు వెతికించాడు. సందు గొందు లన్నీ తన మనుషులను తిప్పించాడు.


సిరియాలదేవి అనుమకొండకు పారిపోయిందన్న వార్త మాత్రం తెలిసింది.

అతను కోపంతో, పగతో ప్రజ్వరిల్లి పోయాడు. మంత్రి, సేనా సమేతుడై అనుమకొండను ముట్టడించాడు.

ఎరుక మహారాజు తన పట్టణాన్ని రక్షించుకోవడానికి సేనాధిపతులను నియోగించి మంత్రివర్గంతో భవిష్యత్ కార్యక్రమం గురించి ఆలోచిస్తున్నాడు.

బల్లహుని రాయబారులు ఎరుక మహారాజును కలుసుకుని—"నీకు బలవంతునితో విరోధము క్షేమకరం కాదు. సిరియాలదేవిని మా రాజుకి అప్పగించి నీ పట్టణాన్ని కాపాడుకో" అని చెప్పారు.

దానికి ఎరుక రాజు—"అయ్యా! మాకు బల్లహునితో విరోధం ఇష్టం కాదు. సిరియాలదేవి ఈ పట్టణంలో ఉందని మీకు కనక నమ్మిక ఉంటే మీరు ఈ పట్నంలోని ప్రతి ఇల్లు వెతుక్కోండి. నా ఆభ్యంతరం




లేదు. కాని ఒక షరతు. మీలో ఎవ్వరూ ఆయుధాలతో పట్నంలోనికి రాకూడదు. నిరాయుధులై రావాలి. మీకు సిరియాలదేవి దొరికితే ఆమెను మీరు యథేచ్ఛగా తీసికొని వెళ్ళవచ్చును. అందుకు మేం అడ్డు రాము" అని చెప్పాడు.

ఈ విషయం రాయబారుల ద్వారా విన్న బల్లహుడు ఆశ్చర్యపోయాడు. సమస్య గోటితో తీసివేసేదిగా కనిపించింది. వర్ణాశ్రమ విధానాలకు భంగం కలగకుండా అన్ని ఇళ్ళు వెతకవలసిందిగా నాలుగు వర్ణాల వారినీ నియోగించాడు. పైగా సిరియాల దేవిని వెదికి తెచ్చిన వారికి మంచి బహుమతు లిస్తానని ప్రకటించాడు.

చాలా రోజులు సిరియాలదేవిని వెతికే కార్యక్రమం నడిచింది.

ఏడో రోజున...విశేషమైన బహుమతులను పొందాలన్న ఆశతో ఒక ధూర్త బ్రాహ్మణుడు మాధవశర్మ ఇంట్లో ప్రవేశించి ఇల్లంతా వెదికి ప్రచ్ఛన్న వేషంలో ఉన్న సిరియాలదేవిని చూశాడు. మాధవశర్మతో "సిరియాలదేవి మీ ఇంట ఉంది కదా!" అన్నాడు.

మాధవశర్మకి శుక్రాచార్యులు బలిచక్రవర్తితో చెప్పిన మాటలు జ్ఞాపకం వచ్చాయి—ఒక స్త్రీని రక్షించడానికి అబద్ధం చెప్పొచ్చునన్న విషయం గుర్తు వచ్చింది.

"సరి సరి. ఆమె నా కూతురు. నా అల్లుడు కాశీకి పోతూ ఆమెను మా ఇంట్లో వదిలి వెళ్ళాడు" అని చెప్పాడు.

కాని వెతకడానికి వచ్చిన బ్రాహ్మణుడు ఎంత చెప్పినా వినిపించుకో లేదు. మిగిలిన వారిని తోడు దీసుకుని సిరియాల దేవిని ఎరుక మహారాజు దగ్గరికి తీసుకుని పోయాడు.

పట్నంలోని బ్రాహ్మణులందరు ఏకమై "అయ్యయ్యో! ఇదేమి ఆగడము. రాజ పత్ని అని చెప్పి బ్రాహ్మణ స్త్రీని ఎతుకు పోతున్నారు. ఇంతకన్నా అన్యాయం ఉంటుందా? లోకంలో సౌందర్యం క్షత్రియ స్త్రీలకే కాని, వేరే వాళ్ళకి ఉండదా? ఈమె మా పుత్రిక. ఈమెను తీసుకు పోయేవారికి దుర్గములు తప్పవు" అని గోల పెట్టారు. గగ్గోలు చేశారు.

ఎరుక దేవరాజు బ్రాహ్మణుల మాటలు విని,, "విప్రులారా! ఈమె క్షత్రియ స్త్రీ యని వారు చెప్పుచున్నారు. ఈమె అంగ సౌష్ఠవం చూస్తేనా కూడా అలాగే తోస్తూంది" అన్నాడు.

ఆ మాటలకు విప్రులకు రోషం వచ్చింది.

"అలాగని ఈమెను తీసుకుని పోయినట్లైతే మేం బంధు మిత్ర కుటుంబ, స్వజన సపరివారంగా అగ్నిప్రవేశం చేసి ముక్తి చెందుతాము. ఈ బ్రహ్మ హత్యలకు బల్లహుడు కారకుడు కనక అతని వంశము, సామ్రాజ్యము నాశనం అయిపోతాయి" అని శపించినట్లుగా మాట్లాడారు.

అక్కడే ఉన్న బల్లహుని మంత్రి ఈ మాటలకు ఆందోళనపడ్డాడు. వ్యవహారం చేయి దాటి పోతూందని గ్రహించాడు.

"అయ్యా విప్రవర్యులారా! ఏమి మాటలు? మీ ఇష్ట మొచ్చినట్లే ఈ మాధవశర్మ మహిమాద్యుడు. ఇలాంటి షట్కర్మ నిరతులు ఈ లోకంలోనే అరుదు. ఈమె రాజపత్ని యని మేం రగడ చేసిన మాట వాస్తవం. అందుకు మేం చింతిస్తున్నాం. ఇప్పుడు మీ పంతం చెల్లింది కదూ. మీరు సంతోషంగా ఉండండి. అయినా మా తృప్తి కొరకు ఒక్క పరీక్ష చేయవలసి ఉంది.

ఆమె బ్రాహ్మణ స్త్రీ యని మీ వాదన కదా! అలాంటప్పుడు ఆమె చేతివడ్డన తినడానికి మీకు అభ్యంతరం ఉండదు కదా. అందువల్ల మీ సిద్ధేశ్వర స్వామి సమ్ముఖంలో ఆమె వడ్డించిన అన్నం మీరంతా భుజించాలి. మీ రలా భుజించి నట్లయితే ఆమెను తక్షణం వదిలేసి మేం ఈ పట్నం వదలి వెళ్ళి పోతాం" లన్నాడు మంత్రి.

ఆ బ్రాహ్మణ స్త్రీ చేతి అన్నాన్ని నిష్ఠా రిష్టులైన బ్రాహ్మలు భుజించరని, ఈ రకంగా నిజం బయట పడుతుందని మంత్రి ఆలోచన.

ఇది విన బ్రాహ్మణ శ్రేష్ఠు లందరూ అవాక్కయి పోయారు. ఏం చెయ్యాలో, ఏం చెప్పాలో తెలియ లేదు. మాధవశర్మకి వెంటనే ఒక ఆలోచన తట్టింది. మిగతా వారంతా తెల్లబోయి చూస్తుండగా అతను మంత్రితో –

"మంత్రివర్యా! మా అమ్మాయి వడ్డించిన అన్నం తినడానికి నాకు కాని, మిగిలిన వారికి కాని అభ్యంతరం లేదు. కాని గర్భిణీ స్త్రీ చేతి అన్నం తినకూడదని శాస్త్రము చెబుతూంది. అందుచే ఇది ఆచరింపతగినది కాదు" అన్నాడు.

మాధవశర్మ సమయ స్ఫూర్తికి మిగిలిన బ్రాహ్మణులు కళ్ళతోనే తమ ప్రశంసలు తెలియజేశారు.

కాని మంత్రి తెలివి తక్కువ వాడు కాడు. అతనికి శాస్త్రాలన్నీ కరతలామలకంగా తెలుసు.

"గర్భిణీ స్త్రీ పక్వాహారం వడ్డించ కూడదని శాస్త్రాలు చెబుతున్నాయి. ఒప్పుకున్నాను. కాని నెయ్యి, లవణం వడ్డించ వచ్చు కదా! ఆమె చేతితో ఆ రెండూ వడ్డన చేయించుకుని భుజించండి" అన్నాడు మంత్రి.

మాధవవర్మ ఆలోచన చేశాడు.

ఆ బ్రాహ్మణ స్త్రీ లవణం, నెయ్యి వడ్డిస్తే బ్రాహ్మణులు తినవచ్చునని శాస్త్రం చెబుతూంది.

మంత్రి పరీక్షకు ఒప్పుకున్నాడు.

సిద్ధేశ్వరుడి ముందు సిరియాల దేవి వడ్డించిన ఘృతము, లవణము గ్రహించారు.

సిరియాలదేవిని వదిలేసి బల్లహుడు తన సైన్యంతో వెళ్ళిపోయాడు.

సిరియాలదేవికి కొన్నేళ్ళ తరవాత పురుషసంతానం కలిగింది. అతనికి మాధవశర్మ అని పేరు పెట్టుకుందామె. అతడు సకల శాస్త్రాలను, విద్యలను నేర్చుకున్నాడు.

తరవాత తన తండ్రిని చంపిన బల్లహుడిపై యుద్ధం ప్రకటించి అతని శిరచ్ఛేదం చేసి అతని కొడుకుని కటక రాజ్యానికి రాజుని చేసి తన రాజ్యాన్ని తాను తీసుకుని ప్రజారంజకంగా, ధర్మబద్ధంగా పరిపాలన చేశాడు. *